RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

తెలంగాణలో నడుస్తున్నది పోలీసుల నిర్బంధ పాలన: జీవో 97 రద్దుకై బీజేపీ పోరు 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 207 | ఆగస్టు 28 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 207 | August 28 Fryday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం

# సరికొత్త హంగులు

### అధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్ నగరంలోని చారిత్రక మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దుతోంది. కుటుంబ సమేతంగా వచ్చి ప్రకృతి అందాలు, జలక్రీడలు, వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మీర్ ఆలం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 544 పైల్స్‌కు గాను 273 (50.18 శాతం), 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయినట్లు తెలిపారు. పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.
కలుషితం కాకుండా మురుగునీటి మళ్లింపు
చెరువులోకి ఎలాంటి మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి, నీటి నాణ్యతను పెంచాలని సూచించారు. జలక్రీడలు ఒ వినోదం: యువత, కుటుంబాలను ఆకట్టుకునేలా బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను అందుబాటులోకి తస్తున్నారు. సౌకర్యాలు: పర్యావరణ భద్రతా ప్రమాణాలకు

➤ మిగతా 2వ పేజిలో..

# నేపాల్‌లో వరద ప్రళయం

### 175కి చేరిన మృతులు, 300 మంది భారతీయులు గల్లంతు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
హిమాలయ దేశం నేపాల్‌ను భారీ ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వరదల తీవ్రతకు మృతుల సంఖ్య 175కు చేరుకోగా, గల్లంతైన వారి సంఖ్య 800 దాటినట్లు అక్కడి విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ జలప్రళయంలో 300 మంది దాకా భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ వెల్లడించారు. వరదల్లో ఆచూకీ లేకుండా పోయిన 826 మందిలో 579 మంది పర్యాటకులు, 162 మంది హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఉద్యోగులు, 85 మంది భద్రతా సిబ్బంది ఉన్నారని అధికారులు ప్రకటించారు. హిమాలయాల్లో మంచు చరియలు విరిగిపడటంతో నీటిమట్టాలు తీవ్రస్థాయిలో పెరిగాయని, ఈ ప్రవాహాలు మరీ దిగువకు వచ్చి ఉంటే భారత సరిహద్దు జిల్లాలపై కూడా ప్రభావం పడేదని మంత్రి పేర్కొన్నారు. హిమాలయ పర్యావరణ వ్యవస్థతో అనుసంధానమైన భారత్, చైనా, నేపాల్, భూటాన్ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసికట్టుగా

# ఈ-ఆటోలుగా పాత ఆటోలు

### డ్రైవర్ల కోసం రూ.200 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకం

**హైదరాబాద్ జనసంఘర్షణ :**
రాష్ట్రంలోని ఆటోరిక్షా డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే పాత ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలు గా మార్చేందుకు ఉద్దేశించిన 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026' అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన ఈ పథకానికి ఏకంగా రూ. 200 కోట్ల

➤ మిగతా 2వ పేజిలో..

## జన్‌ధన్‌కు 12 ఏళ్లు: ఖాతాల్లో

# రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
దేశంలో నిరుపేదలకు బ్యాంకింగ్ సేవలను చెంతకు చేర్చేందుకు ప్రారంభించిన 'ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన' (పీఎంజేడీవై) విజయవంతంగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు అద్దం పడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 59 కోట్లకు పైగా జన్‌ధన్ ఖాతాలు ప్రారంభం కాగా, వాటిలో మొత్తం డిపాజిట్లు రూ. 3.17 లక్షల కోట్ల మార్కును దాటాయి. ఈ విజయంపై కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది దేశ

➤ మిగతా 2వ పేజిలో..

# క్రీడలు యువశక్తిని వెలికితీసే సాధనాలు

**- ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ యువతకు, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'ఖేలో ఇండియా సంవాద్' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లతో వర్చువల్‌గా ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. క్రీడలనేవి కేవలం పతకాలకే పరిమితం కాదని, అవి యువతలోని ఆత్మవిశ్వాసాన్ని, చైతన్యాన్ని వెలికితీస్తాయని పేర్కొన్నారు. గత ఒలింపిక్స్ క్రీడల్లో మన భాగస్వామ్యంపై విచారం వ్యక్తం చేస్తూ.. 2012 ఒలింపిక్స్‌లో భారత్ కేవలం 12 విభాగాల్లోనే ప్రాతినిధ్యం వహించిందని, సర్ఫింగ్ వంటి కొత్త క్రీడల్లో కూడా మన ప్లేయర్లు రాణించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రతిభకు కొదవలేదని, 5 నుంచి 15 ఏళ్ల వయస్సున్న చిన్ననాటి నుంచే 'మట్టిలో మాణిక్యాలను' గుర్తించి తీర్చిదిద్దేందుకే

➤ మిగతా 2వ పేజిలో..

# అమెరికా వీసా ఇంటర్వ్యూల రీషెడ్యూల్

### భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల్లో తీవ్ర అనిశ్చితి

**వాషింగ్టన్ జనసంఘర్షణ**
అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉద్యోగాల్లో స్థిరపడాలని భావిస్తున్న వేలాది మంది భారతీయులకు మళ్లీ ఆందోళన మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా ఎంబసీలు, కాన్సులేట్లలో వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా రీషెడ్యూల్ చేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. తమ కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటమే ఈ హఠాత్ మార్పులకు కారణమని వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించేందుకు గాను అమెరికా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారులు భవిష్యత్తులో అమెరికా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు లేదా

➤ మిగతా 2వ పేజిలో..

# మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు

**మొదటిపేజీ తరువాయి..** అనుగుణంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఫుడ్ కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలను ఏర్పాటు చేయనున్నారు.

ఐలాండ్ల అభివృద్ధి: చెరువులోని ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లతో కూడిన 'గ్లాంపింగ్ స్పాట్లు'గా, డెస్టినేషన్ వెడ్డింగ్స్ మరియు ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు.

పిపిపి మోడల్‌లో ఉపాధి: నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

జూ పార్క్‌తో అనుసంధానం

సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్క్‌తో మీర్ ఆలం చెరువు అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీనివల్ల జూ పార్క్‌కు వచ్చే సందర్శకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, వినోదాన్ని పొందే అవకాశం లభిస్తుంది. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మీర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

## తెలంగాణలో నడుస్తున్నది పోలీసుల నిర్బంధ పాలన: జీవో 97 రద్దుకై బీజేపీ పోరు

హైదరాబాద్ :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుపుతున్నది ప్రజాపాలన కాదని, పోలీసుల నిర్బంధ పాలన అని బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జీలు చేయించడాన్ని, అక్రమ అరెస్టులను బీజేపీ తీవ్రంగా ఖండించింది.

ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామాంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల వరకు విద్యార్థులు శాంతియుతంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించింది. రామాంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుతో పాటు కీలక నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించింది. చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న తీరు కనిపించడం లేదా అని ప్రశ్నించింది.

పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, ఈసెట్ (ఙుఙఙు) ద్వారా విద్యార్థులకు లభించే ఉన్నత విద్యా అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ విరమించుకోవాలని డిమాండ్ చేసింది. కంటితుడుపు కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా జీవో 97ను బేషరతుగా రద్దు చేయాలని సూచించింది. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ చివరి వరకు అండగా ఉండి రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేసింది.

## ఈ-ఆటోలుగా పాత ఆటోలు

**మొదటిపేజీ తరువాయి..** బడ్జెట్‌ను కేటాయిస్తూ రవాణా శాఖ జీవో జారీ చేసింది. 18,766 ఆటోలకు లబ్ది పథకం మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిరోజూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటం, వాహన నిర్వహణ ఖర్చులు భారంగా మారడంతో ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. తగ్గనున్న నిర్వహణ వ్యయంసంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఈ-ఆటోల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ కాలుష్యానికి చెక్ పడటంతో పాటు, ఆటో డ్రైవర్ల రోజువారీ నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. పెట్రోల్ వ్యయంతో పోలిస్తే చార్జింగ్ ఖర్చులు చాలా తక్కువగా ఉండటంతో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. రూ. 200 కోట్ల కేటాయింపులతో ఈ 18,766 ఆటోల మార్పిడి ప్రక్రియను ఏ విధానంలో అమల్లోకి తెస్తారనే దానిపై త్వరలోనే పూర్తి స్పష్టత రానుంది.

## అమెరికా వీసా ఇంటర్వ్యూల రీషెడ్యూల్

**మొదటిపేజీ తరువాయి..** ప్రజా ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా లేదా అనే అంశాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఖరారైన పలు అపాయింట్‌మెంట్లను రద్దు చేసి, తదుపరి తేదీలను తర్వాత తెలియజేస్తామని దరఖాస్తుదారులకు సమాచారం పంపుతున్నారు.

భారతీయులపై తీవ్ర ప్రభావం

ఈ పరిణామం భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదివేందుకు 3.30 లక్షలకు పైగా భారతీయ విద్యార్థులు సిద్ధంగా ఉండగా, హెచ్-1బీ (ఀ-1ఔ) వీసాల ఆమోదంలో భారతీయుల వాటా ఏకంగా 70 శాతానికి పైగా ఉంది. ఈ తరుణంలో ఇంటర్వ్యూ తేదీల్లో జాప్యం జరగడం వల్ల విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలు, ఉద్యోగార్థుల జాబ్ ఆఫర్లు, ప్రయాణ ప్రణాళికలు తలకిందులయ్యే ప్రమాదం ఏర్పడింది.

వీసా జారీ నిలిపివేత కాదు!

అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు గానీ, హెచ్-1బీ వర్క్ వీసాల జారీ ప్రక్రియను గానీ అమెరికా ప్రభుత్వం పూర్తిగా నిలిపివేయలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌లో ఏర్పడిన తాత్కాలిక అంతరాయం మాత్రమేనని పేర్కొన్నారు. అయినప్పటికీ వీసా స్క్రీనింగ్ నిబంధనలు, హెచ్-1బీ ఖర్చులు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు వస్తున్నందున అమెరికా వెళ్లేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## గిరిజన విద్యార్థులకు 'నీట్, ఐఐటీ' ఉచిత కోచింగ్: మారికవలసలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

**అమరావతి :**

గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచి, జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నం జిల్లా మారికవలసలోని రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (జఔజు)ను అందుబాటులోకి తెచ్చినట్లు ఏపీ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి తెలిపారు.

ప్రతిభ ఆధారంగా 600 మంది ఎంపిక

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్ (చీజుజు), ఐఐటీ, జేఈఈ (జీజుజు)లకు సిద్ధమయ్యే గిరిజన విద్యార్థులకు ఈ కేంద్రంలో నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నారు. ఇంటర్మీడియట్ విద్యనభ్యసించేందుకు ప్రతిభ ఆధారంగా మొత్తం 600 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో లింగ సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ 300 మంది బాలురు, 300 మంది బాలికలకు ప్రవేశాలు కల్పించారు.

ఉచిత వసతి, ఐటీ పరికరాలు

దేశంలోని ఐఐటీలు, నిట్లు, ఎయిమ్స్ సహా ప్రధాన వైద్య, ఇంజినీరింగ్ కళాశాలల్లో గిరిజన బిడ్డలను నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్‌తో పాటు ఉచిత వసతి, పౌష్టికాహారం, ఐటీ డిజిటల్ పరికరాలు, ఆధునిక ఫర్నిచర్ వంటి మౌలిక వసతులను సమకూర్చుతున్నారు. గిరిజన విద్యార్థుల విద్యా పురోగతికి, ఉన్నత ఉద్యోగ అవకాశాల సాధనకు ఈ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' రోల్ మోడల్‌గా నిలుస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

## జన్‌ధన్‌కు 12 ఏళ్లు: ఖాతాల్లో రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు

**మొదటిపేజీ తరువాయి..** బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్పష్టమైన నిదర్శనమని కొనియాడారు. అత్యధికంగా మహిళల పేరిటే.. మొత్తం తెరిచిన జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనే ఉండటం విశేషం. సమాజంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది ఎంతగానో ఉపయోగపడిందని, అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉన్నాయని నివేదిక స్పష్టం చేస్తోంది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే క్రమంలో భాగంలో ఖాతాదారులకు ఇప్పటివరకు 41.29 కోట్లకు పైగా ఉచిత 'రూపే' (=ఋఫుు) డెబిట్ కార్డులను జారీ చేశారు.

అతుకులు లేని సంక్షేమ ఫలాలు

జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జీూవీ) అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. ఉచిత ప్రమాద బీమా, పెన్షన్ సదుపాయాలతో పాటు కనీస నిల్వ (వఱఅఱఎబఎ ఱaశaఅషవ) నిబంధన లేకుండానే రూ.10,000 వరకు ఓవర్‌డ్రాఫ్ట్ (ూణ) సౌకర్యం, ముద్రా రుణాల సదుపాయాన్ని కూడా ఈ ఖాతాల ద్వారా అందిస్తున్నారు.

2014 ఆగస్టు 28న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దేశంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక బ్యాంక్ ఖాతా ఉండాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకం, పేదల్లో పొదుపు అలవాటును పెంచడమే కాకుండా ఆర్థిక భద్రతను అందించడంలో కీలక పాత్ర పోషించింది. అయితే చెక్కు సౌకర్యం కావాలనుకునే ప్రయాణికులు/ఖాతాదారులు మాత్రం తమ ఖాతాలో కనీస బ్యాలెన్స్ నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

## క్రీడలు యువశక్తిని వెలికితీసే సాధనాలు

**మొదటిపేజీ తరువాయి..** ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే ఒలింపిక్స్‌లో భారత్ మెరుగైన ప్రదర్శనతో పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ప్రధాని హామీ ఇచ్చారు. కాగా, ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ రాష్ట్రం వేదిక కానుంది. ఇందులో భాగంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలు జరగనున్నాయి.

## ఆనాడు ప్రాజెక్టులు పూర్తి చేసుంటే ఈ దుస్థితి వచ్చేదా: మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం

**విశాఖపట్నం :**

రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయ రంగానికి వచ్చిన దుస్థితికి, సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసానికి వైకాపా అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి దుర్నీతియే కారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలుగుదేశం హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను గత ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేసి ఉంటే, నేడు 'ఎల్ నినో' వంటి ప్రతికూల పరిస్థితులు వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని స్పష్టం చేశారు.

గురువారం విశాఖపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి, గత ఐదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ జగన్ ప్రెస్ మీట్లు పెట్టి అబద్ధాలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కంటే జగన్ పాలనే అతిపెద్ద విపత్తు అని అభివర్ణించారు.

అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం ఉందా?

రైతులపై నిజంగా ప్రేమ ఉంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. "సభకు వస్తే గత ఐదేళ్లలో బీసీలకు, రైతులకు చేసిన అన్యాయాలపై నిలదీసి సమాధానం చెబుతాం. క్రిమినల్ ముసుగులో పార్టీ పెట్టడం వల్లే రాజకీయాల్లో ఉన్నారు. తాము కక్ష సాధింపు చర్యలకు దిగడం లేదు, చట్టప్రకారమే చర్యలు ఉంటాయి. ఒకవేళ 'రెడ్ బుక్'ను పూర్తిగా అమలు చేస్తే వైకాపాలో ఎవరైనా మిగులుతారా?" అని ప్రశ్నించారు.


బీసీల రిజర్వేషన్లు తగ్గించింది జగనే!

గత వైకాపా ప్రభుత్వ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండ సాగిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించింది జగన్ కాదా అని మంత్రి నిలదీశారు. అప్పట్లో అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపా నేతలు, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎల్ నినో పరిస్థితులపై తమ ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో ఉందని, ప్రాజెక్టులను మళ్లీ గాడిలో పెడుతూ రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# ఒకేసారి గ్రూప్-2, గ్రూప్-3 సాధించిన ప్రతిభావంతి...
# వ్యవస్థ నిర్లక్ష్యానికి బలికావాల్సిందేనా?

- సంధ్య మృతిపై హోరెత్తుతున్న ఆగ్రహం
- అద్భుత ప్రతిభ నిండిన జీవితం... అమాయకపు ప్రేమ మోసంతో విషాదాంతం
- మహబూబాబాద్‌లో న్యాయం కోసం దిక్కులుపిక్కటిల్లే ఆక్రందనలు
- కన్నీటి సాక్షిగా గ్రీన్ ఇంక్ మరణ వాంగ్మూలం
- 11 రోజులైనా దొరకని న్యాయం - నిందితుడిని బంధించాలని విద్యార్థి లోకం డిమాండ్
- ఆరేళ్ల సుదీర్ఘ శ్రమ... మూడు ఉన్నత కొలువులు: వెలుగులు నింపాల్సిన బిడ్డను బలితీసుకున్న నయవంచనపై న్యాయపోరాటం
- బాధిత తల్లిదండ్రులకు అండగా నిలవాలి
- కుల, రాజకీయాలతీతంగా న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడదాం - దాసరి గోపాలకృష్ణ పిలుపు





ఇల్లందు, ఆగస్టు 27 జన సంఘర్షణ

**పట్టుదలకు నిలువెత్తు రూపం... ప్రతిభకు పరాకాష్ఠ**

మహబూబాబాద్ పట్టణానికి చెందిన డోలి వెంకన్న, పద్మల ద్వితీయ పుత్రిక డోలి సంధ్య అపారమైన కష్టానికి, నిరంతర శ్రమకు నిదర్శనంగా నిలిచారు. 2018లో బీటెక్ పూర్తి చేశాక, ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా రోజుకు 16 గంటలు చదువుతూ తన లభించిన సమయాన్నంతా చదువుకే కేటాయించారు. కష్టపడే తత్వంతో ఆమె సాధించిన విజయాలు జిల్లాకే గర్వకారణంగా నిలిచాయి.

**వరుస ఉద్యోగాలతో సత్తా చాటిన ధీర**

కఠినమైన పోటీ పరీక్షల్లో తన ప్రతిభతో వరుస కొలువులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు సంధ్య. ఇప్పటికే గ్రూప్-4 లో ఉన్నత ర్యాంకు సాధించి ప్రస్తుతం మహబూబాబాద్ మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతటితో ఆగక, గ్రూప్-3 లో 269.9 మార్కులతో 1,125 ర్యాంకు (జోనల్ పరిధిలో బీసీ-ఏ మహిళా విభాగంలో 2వ ర్యాంకు) సాధించారు. అంతేకాక, గ్రూప్-2 లో 382.4 మార్కులతో 205వ ర్యాంకు కైవసం చేసుకుని తన అద్భుత సత్తాను చాటారు.

**వెలుగులు నింపాల్సిన ఇంట్లో కమ్మేసిన చీకట్లు**

ఒకేసారి గ్రూప్-4, గ్రూప్-3, గ్రూప్-2 వంటి ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలకు ఎంపికై ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన ఆ బిడ్డ, ఉన్నపళంగా ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఒక నిరుపేద కుటుంబానికి వెలుగుగా నిలవాల్సిన విద్యావంతురాలు ఇలా అకాలంగా ప్రాణాలు కోల్పోవడం సమాజాన్ని తీవ్రంగా చలింపజేసింది.

**ప్రేమ పేరుతో నయవంచనకు గురయ్యారన్న ఆరోపణలు**

బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం... అదే మున్సిపాలిటీలో వార్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తేజావత్ శ్యామ్ (రేకుల తండా) సంధ్యతో వృత్తిరీత్యా సాన్నిహిత్యం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెబుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, తీరా చివరి క్షణంలో తన సొంత మేనమరదలితో నిశ్చితార్థం జరిగిందని, ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సంధ్య తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని వారు ఆరోపిస్తున్నారు.

**గ్రీన్ కలర్ పెన్నుతో రాసిన మరణ వాంగ్మూలం**

ఎంతో శ్రమించి సాధించిన గ్రీన్ కలర్ పెన్నుతో సంధ్య రాసిన 4 పేజీల సూసైడ్ నోట్ ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేస్తోంది. తీవ్ర మనోవేదనకు గురై ఆగస్టు 17న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆత్మహత్యకు పాల్పడిన సంధ్య, తన లేఖను మరణ వాంగ్మూలంగా పరిగణించి శ్యామ్ మరియు అతని తల్లిదండ్రులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు విద్యార్థి సంఘ నాయకులు పేర్కొన్నారు.

**తల్లిదండ్రుల గుండెకోత - 'మేము బ్రతికి ఉండటం దండగ'**

రేంబవళ్లు కష్టపడి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాన్ని నిలబెడుతుందనుకున్న కూతురు ఉరికొయ్యకు వేలాడుతూ కనిపిస్తే తట్టుకోవడం ఏ తల్లిదండ్రుల తరమూ కాదు. "మాలాంటి నిరుపేద మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ చొరవ తీసుకోవాలి, లేకపోతే మేము బ్రతికి ఉండటం కూడా వ్యర్థమే" అని సంధ్య తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ ప్రాధేయపడుతున్న దృశ్యం కలచివేస్తోంది.

**11 రోజులు గడుస్తున్నా లేని పురోగతి - టీఎన్వీఎస్ ఆగ్రహం**

ఘటన జరిగి 11 రోజులు గడుస్తున్నా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడంపై తెలుగునాడు విద్యార్థి సమాఖ్య నాయకులు దాసరి గోపాలకృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆధారాలు ఉన్నప్పటికీ విచారణలో ఆలస్యం జరగడం సమాజంలో మహిళలకు లభిస్తున్న రక్షణను ప్రశ్నిస్తోందని, నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

**సామాజిక వర్గాల ఐక్యతకు పిలుపు**

బాధిత కుటుంబం బీసీ (గంగపుత్ర) సామాజిక వర్గానికి చెందినది. నిందితుడికి శిక్ష పడి బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరగాలంటే కేవలం ఒక్క వర్గమే కాకుండా, అన్ని కుల సంఘాలు, సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీలు ఏకమై ముందుకు రావాలని, వారికి అండగా నిలవాలని విద్యార్థి నాయకులు విజ్ఞప్తి చేశారు.

**కులమతాలకు అతీతంగా న్యాయపోరాటం**

సంధ్యకు జరిగిన అన్యాయం రేపు మరొక ప్రతిభావతురాలైన ఆడపిల్లకు ఎదురుకాకూడదంటే సమాజం ముక్తకంఠంతో స్పందించాలి. కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాలను పక్కనబెట్టి సంధ్య తల్లిదండ్రులు చేస్తున్న ఈ ధర్మపోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని దాసరి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు.

**స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు**

పోలీస్ శాఖ వారు తక్షణమే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించకపోతే, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఉధృత ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక మేధావి బలికావడంపై నిష్పాక్షిక విచారణ జరిపి న్యాయం గెలిచేలా చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఖేలో ఇండియా సంవాద్

పాల్వంచ, ఆగస్టు 27 (జన సంఘర్షణ)

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖేలో ఇండియా సంవాద్ - మై భారత్, నేషనల్ స్పోర్ట్స్ డే 2026 కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ డా. వేముల కామేశ్వరరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ పొట్లపూవు శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వి. వంశీ, ఎం.






విక్రాంత్‌తో పాటు ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్ టి. కళ్యాణ్‌ను ప్రిన్సిపాల్, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారతదేశం ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించేలా యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం నషా ముక్త్ యువ - వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ ప్రతిజ్ఞను డా. వేముల కామేశ్వరరావు చేయించారు. కార్యక్రమం విజయవంతం కావడంపై ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

# సిద్ధాపూర్‌లో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాపై విచారణ

రుద్రూర్,/ ఆగస్టు 27 /(జనసంఘర్షణ):

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా సిద్ధాపూర్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 53 వద్ద గురువారం ఎస్ఐఆర్ హియరింగ్ నిర్వహించారు. రుద్రూర్ తహసీల్దార్ ఏఈఆర్‌ఓగా విచారణకు హాజరై ఓటర్ల జాబితాలోని వివిధ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డీ (గైర్హాజరు, మరణించిన, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన) ఓటర్లు, డబుల్ ఓటర్లు, ఓటరు వివరాల్లో సవరణలు, మ్యాపింగ్ కాని ఓటర్లు తదితర అంశాలపై విచారణ చేపట్టారు. సంబంధిత ఓటర్ల వివరాలను పరిశీలించి, అభ్యంతరాలు, సవరణలపై అధికారులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల బీఎల్ఓ సూపర్‌వైజర్, నాయబ్ తహసీల్దార్, బీఎల్ఓ, గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పులేకుండా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు సూచించారు.



# శబరి బాలికా నిలయం ఏర్పాటు చేయడం సంతోషకరం

- విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేసిన దంపతులు
- విజయ్ కుమార్ శర్మ, లలిత దంపతులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం, ఆగస్ట్ 27 (జనసంఘర్షణ ) :



చర్లలో వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో బాలికల కొరకు విద్యార్థి నిలయం ఏర్పాటు చేయడం అబినందనీయమని రైస్ పేట లోని కోట బండాలమ్మ తల్లి ఆలయ అర్చకులు పున్నమరాజు కార్తీక్ శర్మ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా బాలికా నిలయం విద్యార్థులకు కార్తీక్ శర్మ తల్లిదండ్రులు, సాయిబాబా ఆలయ అర్చకులు విజయకుమార్ శర్మల, లలిత దంపతులు నూతన దుస్తులను అందచేసారు. గురువారం శబరి బాలికా నిలయ బాధ్యులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్తీక్ శర్మ విద్యార్ధిలకు నూతన దుస్తులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చర్లలో గిరిజన బాలుర కొరకు కొమరం భీం విద్యార్థి నిలయం నిర్వహించి వారిని క్రమశిక్షణ కలిగిన బాలురుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఈ ఏడాది నుండి చర్లలోనే గిరిజన బాలికల కొరకు శబరి పేరిట విద్యార్థి నిలయం ఏర్పాటు చేయడం అబినందనీయమని పేర్కొన్నారు. ఆదివాసీల కొరకు వనవాసీ సంస్థ పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలు సద్వినియోగపరుచుకొని శ్రద్ధతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి, సుజాత, వరలక్ష్మి, సంతోష్, ముఖేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ముగ్గురు ఎంపిక

బోధన్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):

ది ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు క్రీడా రంగంలో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన చరణ్, ఋషిక, నేత్ర శ్రీ 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు దీనాూా గ్రౌండ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, వారి ప్రతిభను అభినందించింది. క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపల్ అపూర్వ, టీచర్లు, డైరెక్టర్ హారికలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ముగ్గురు విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని మంచి ఫలితాలు సాధించాలని, పాఠశాలకు, బోధన్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించింది.




# రామాయంపేటలో ఎస్ఐఆర్ నోటీసులపై పరిశీలన

- ఓటర్ల వివరాల్లో తప్పులు సరిదిద్దాలి. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడురాగి రాములు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండల, పట్టణ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సుమారు 9,000 నోటీసులు జారీ కావడం జరిగిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ రాగి రాములు తెలిపారు. జారీ చేసిన నోటీసుల్లో 8,000కు పైగా ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలలో తప్పులు ఉన్నట్లు గుర్తించబడుతున్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా 800కు పైగా ఓటర్ల వివరాలు ఇప్పటివరకు మ్యాపింగ్ కాలేదని, ఆ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు రామాయంపేట ఎమ్మార్వో కార్యాలయానికి నో మ్యాపింగ్‌కు సంబంధించిన పలువురు ఓటర్లు హాజరై, తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించి, ఎమ్మార్వో గారి సమక్షంలో తమ వివరాలపై తగిన వివరణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాగి రాములు, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ పాల్గొని ఓటర్ల సమస్యలను స్వయంగా పరిశీలించారు. నో మ్యాపింగ్ మరియు ఓటర్ల వివరాల్లో ఉన్న తప్పులపై ప్రజలకు తగు సూచనలు చేసి, సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించారు. అలాగే ఓటర్లకు సంబంధించిన వివరాల్లో ఉన్న తప్పులను పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో గారికి రాగి రాములు విన్నవించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనల ప్రకారం సవరణలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు హక్కు పరిరక్షించబడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాగి రాములు అన్నారు. ప్రజలు కూడా తమకు అందిన నోటీసులను పరిశీలించి,పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తదితర వివరాల్లో తప్పులు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# హంగర్గాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఓటరు జాబితా పరిశీలన..
- గ్రామ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ



**హంగర్గ, ఆగస్టు 27 (జనసంఘర్షణ):** హంగర్గ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలోని వివరాలను పరిశీలిస్తూ అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకోవాలని, పేరు లేకపోయినా అర్హత ఉన్న వారు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గైర్హాజరు, మృతి చెందిన, వేరే ప్రాంతాలకు తరలిపోయిన, డూప్లికేట్ ఓటర్ల వివరాలను కూడా పరిశీలించి జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉదయ భాస్కర్, ఉపసర్పంచ్ దుర్గి గోపాల్, బీఎల్ఓ స్వరూప, పంచాయతీ కార్యదర్శి గంగారం, ఫీల్డ్ అసిస్టెంట్ యాదవరావు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సర్పంచ్, అధికారులు సూచించారు.

## పోతంగల్ ప్రజలు ఓటరు జాబితాను పరిశీలించాలి

- పేరు లేకపోయినా.. వివరాల్లో తప్పులున్నా సరిచేసుకునే అవకాశం

**పోతంగల్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):** గ్రామ పంచాయతీ పోతంగల్ పరిధిలోని ప్రజలందరూ ఓటరు జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ అస్లాం (సుల్తాన్) సూచించారు. గురువారం పోతంగల్ గ్రామ పంచాయతీ వద్ద ఓటరు జాబితా పరిశీలనకు సంబంధించిన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేరు లేకపోయినా వెంటనే నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సవరణలు చేయించుకోవాలని కోరారు.




ప్రతి కుటుంబం తమ సభ్యులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా ముందస్తుగా జాబితాలో వివరాలను నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు.

స్థలం: గ్రామ పంచాయతీ, పోతంగల్
తేదీ: 27-08-2026

ఓటరు జాబితాకు సంబంధించి సమాచారం లేదా సహాయం అవసరమైన వారు తనను వ్యక్తిగతంగా సంప్రదించవచ్చని సయ్యద్ అస్లాం (సుల్తాన్) తెలిపారు.

# తొనిగండ్లలో గ్రామసభ

- గ్రామంలో శుభ్రత పరిశుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమల నియంత్రణ కోసం పాగింగ్ చేయించాలి.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ కార్యాలయం దగ్గర గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామసభలో గ్రామ సర్పంచ్ మల్లన్న గారి శివకుమార్ నాగులు, ఉప సర్పంచ్ దుర్గయ్య, వార్డు సభ్యులు బాలకృష్ణ సుజాత, మమత రమేష్ గ్రామంలో భాను ప్రసాద్, గ్రామపంచాయతీ సెక్రటరీ మౌనిక బి ఎల్ ఓ సుమలత గ్రామ సభలో ఓటర్ అందరికీ ఎస్ఐఆర్ గురించి పూర్తిగా వివరించడం జరిగింది ముఖ్యంగా ఎవరైనా ఓటర్ లిస్టులో పేరు నమోదు కాకపోతే వెంటనే గ్రామంలో ఉన్న బిఎల్ఓ సమాచారం ఇవ్వవలసిందిగా కోరడమైనది.

# ఓటరు జాబితాలో వివరాలు సరిచూసుకోవాలి


- ఆర్డివో రమాదేవి.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)** ఓటరు జాబితాలో వివరాలు సరిచూసుకోవాలనీ ఆర్డివో రమాదేవి అన్నారు. గురువారం ఓటరు జాబితాలోని వివరాల పరిశీలన, సవరణల అంశాలపై మెదక్ పట్టణంలోని 133,134 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో ఆర్ డి ఓ రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డిఓ రమాదేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించాలని వారు సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేరు, వయస్సు, చిరునామా, ఫోటో, బంధుత్వం తదితర వివరాల్లో సవరణలు అవసరమైతే ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు, బిఎల్ఓ లు, బిఎల్ఏ లు, సంబంధిత అధికారులు ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచేసుకుని నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

## చైతన్‌నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

- ఓటర్ల వివరాల పకడ్బందీ పరిశీలనకు ఎమ్మార్వో సందీప్ సూచనలు



**చైతన్‌నగర్, /ఆగస్టు 27/ (జనసంఘర్షణ):** చైతన్‌నగర్ గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎమ్మార్వో సందీప్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఓటర్ల వివరాల పరిశీలన, మార్పులు-చేర్పులు, అర్హత కలిగిన ఓటర్ల వివరాల నమోదు తదితర అంశాలను ఆయన పరిశీలించి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మార్వో సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు కూడా సహకరించి తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ కాంత సునీల్, ఉప సర్పంచ్ యాదవ్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వెంకట్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డాక్టర్ మోహన్ నాయక్

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా హవేలీ ఘణపూర్ మండల కేంద్రానికి చెందిన చాకలి వెంకటి అనారోగ్య కారణంతో మరణించారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారిగ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, గ్రామ పెద్దలు లక్ష్మయ్య, కృష్ణ, శ్రీను, సిద్దు, మహేష్, శేఖర్, రాములు, నరేష్ ,శంకర్, వెంకటి, శ్రావణ్, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టబద్ధమైన దత్తతతే సురక్షితం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.
- కలెక్టర్ సమక్షంలో బాలికను దత్తత తీసుకున్న దంపతులు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)** బాలల సంక్షేమం, సంరక్షణలో భాగంగా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో జిల్లా కలెక్టర్ సమక్షంలో హైదరాబాద్ కు చెందిన దంపతులు బాలల సదన్ లో 11 సంవత్సరాల బాలిక అపర్ణను చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా తమ కుటుంబంలోకి స్వీకరించారు. 2020లో ప్రభుత్వ పోర్టల్ మిషన్ వాత్సల్య ద్వారా చట్టబద్ధ దత్తత కోసం హైదరాబాద్‌కు చెందిన దంపతులిద్దరూ దరఖాస్తు చేసుకున్నారన్నారు. బాలల సంక్షేమానికి సంబంధించిన నిబంధనలను పాటిస్తూ, అధికారిక ప్రక్రియ ద్వారా దత్తత తీసుకోవడం ద్వారా బాలలకు సురక్షితమైన, ప్రేమతో కూడిన కుటుంబ వాతావరణాన్ని కల్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. దత్తత తీసుకునే తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను, సంబంధిత అధికారుల మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా బాలల భవిష్యత్తుకు భద్రత కల్పించడంతో పాటు, వారికి కుటుంబ ప్రేమ, ఆప్యాయత, విద్య, సంరక్షణ అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా దత్తత తీసుకోవడం లేదా ఇవ్వడం చేయరాదని, దత్తతకు సంబంధించి ఎలాంటి అనధికార మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం దత్తత తీసున్న బాలిక బాగోగులను ప్రతి 6 నెలలకు ఒక సారి పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా బాలికను దత్తత తీసుకున్న దంపతులను జిల్లా కలెక్టర్ అభినందించారు. బాలికకు మంచి భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, డిసిపిఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పరుచూరి వారి ఆధ్వర్యంలో స్టేషనరి సామాగ్రి పంపిణి

- పరుచూరి మనోహర్ వితరణతో

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 27(జనసంఘర్షణ):**





చర్ల మండలం, లింగాపురం ప్రాథమిక పాఠశాలలో దాత పరుచూరి మనోహర్ ప్రసాద్ వితరణతో విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురాజు అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో మీకోసం మేమున్నాం టీం ఛైర్మెన్ లయన్ నీలి ప్రకాష్, బండారి రామకృష్ణ, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డి సూరిబాబు, వంగా సత్యనారాయణ, ఆవుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ తడికల నరేష్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ స్వరూప, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నరేంద్రబాబు, కొంగూరు సత్యం, తడికల విజయ నర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ తాను బాల్యంలో చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకొని, గత 10 సంవత్సరాలుగా పాఠశాలకు ప్రతీ సంవత్సరం ఏదో ఒక సేవ అందించడం ఎంతో గొప్ప విషయమని, ఇలాగే ప్రతి ఒక్కరూ స్పందించి, తమ వితరణలతో వెనుకబడిన ఈ ప్రాంతాలకు విరివిగా సేవలందించాలని కోరారు.

# పోతంగల్‌లో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక గ్రామసభ

◆ నోటీసులకు భయపడొద్దు.. నిర్ణీత గడువులో ధ్రువపత్రాలు సమర్పించాలి...

పోతంగల్/, ఆగస్టు 27/ (జనసంఘర్షణ):



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పోతంగల్ గ్రామ పంచాయతీలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ క్యాతం కల్లూరి సంధ్యా భజరంగ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డిప్యూటీ తహశీల్దార్ అజీజ్ హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన వారు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. అధికారుల నుంచి నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ సంబంధిత ఆధారాలు, సరైన ధ్రువపత్రాలను నిర్ణీత తేదీలోపు సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకుని ఏవైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామసభలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారులు గ్రామస్థుల... సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మైన్స్ ఏడీ ఇంట్లో ఏసీబీ సోదాలు

◆ ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలు..
◆ 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు

జయశంకర్ భూపాలపల్లి, /ఆగస్టు 27/ (జనసంఘర్షణ):









జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ (భూగర్భ గనుల శాఖ) విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న సమాచారంతో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం.

జయరాజ్‌కు సంబంధించిన భూపాలపల్లి, హైదరాబాద్‌లోని నివాసాలతో పాటు తాండూరు, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో మొత్తం సుమారు 12 చోట్ల ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, కీలక పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలు, తదుపరి చర్యలపై ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

**అధికారులకు హెచ్చరిక.....**

ప్రభుత్వ విధుల్లో ఉన్న అధికారులు చట్ట నిబంధనలకు లోబడి, పారదర్శకంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం, అవినీతికి పాల్పడటం వంటి ఆరోపణలు ఎదురైతే దర్యాప్తు సంస్థల తనిఖీలు, చట్టపరమైన చర్యలు తప్పవనే సందేశాన్ని ఈ తరహా ఏసీబీ సోదాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజా సేవలో నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులకు ఈ ఘటన హెచ్చరికగా నిలుస్తోంది.

# ప్రమాదకరంగా మారిన మాదారం పెద్ద చెరువు అలుగు బ్రిడ్జి

◆ తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.. లేదంటే కొత్త బ్రిడ్జి నిర్మించాలి
◆ కట్ట రోడ్డుకు డాంబర్ లేదా సీసీ రోడ్డు వేయాలి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డిమాండ్

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం, గుంపెల్లగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని మాదారం పెద్ద చెరువు అలుగు బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. చెరువు కట్టపై ఉన్న రహదారులు సైతం గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెబ్బతిన్న అలుగు బ్రిడ్జి, కట్ట రోడ్లను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కమిటీ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ మాట్లాడుతూ.. బ్రిడ్జి కూలిపోయే స్థితికి చేరుకున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రమాదకరంగా మారిన అలుగు బ్రిడ్జికి తక్షణమే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువు కట్టపై రాకపోకలు సురక్షితంగా సాగేందుకు డాంబర్ లేదా సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. స్థానిక గ్రామపంచాయతీల సర్పంచులు, సింగరేణి నియోజకవర్గ ఎమ్మెల్యే బానోత్ రాందాస్ నాయక్, సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. వర్షాకాలంలో మరింత నష్టం జరిగితే పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్మాణ పనులు చేపట్టకపోతే స్థానిక ప్రజలను సమీకరించి



సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని టి. ఝాన్సీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గూగుల్ తేజ నాయక్, సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్, మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, కోయిల శ్రీనివాస్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు..

◆ కోటగిరిలో ఘనంగా ముస్లిం సోదరుల ర్యాలీ

కోటగిరి,/ ఆగస్టు 27/ (జనసంఘర్షణ):



ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలను కోటగిరి మండల కేంద్రంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జీఎంకే ట్రేడర్స్ ప్రొప్రైటర్ జుబేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ....మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమ, సోదరభావంతో మెలగాలని కోరారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాబు ఖాన్, జేమీర్, వాహిద్, అఫ్జల్, ఉస్మాన్ అలీ, ముసరఫ్ అలీ, అన్సారి వహీద్, తాయూబ్, షాదుల్లా, శంషు తదితరులు పాల్గొన్నారు.

# నూతన చేయూత పింఛన్ల కొరకు లబ్ధిదారు దరఖాస్తులు చేసుకోవాలి

◆ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27(జన సంఘర్షణ)



చివరి తేదీ:31.08.2026 జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ పై జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడారు. కొత్త చేయూత పింఛన్లు దరఖాస్తులు మండల, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. చేయత పింఛన్ల దరఖాస్తుల సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామన్నారు.పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఏదైనా ధృవీకరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్ డెస్క్ సహాయకారిణిగా పనిచేస్తుందని, సమస్య ఉన్నట్లయితే వెంటనే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలన్నారు. అర్హులైన వారు త్వరితగతిన దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

# పోతంగల్ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్‌లో ఆకట్టుకున్న రాఖీల తయారీ

◆ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమంలో విద్యార్థుల సృజనాత్మకతకు పదును

పోతంగల్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):

రాఖీ పండుగను పురస్కరించుకుని పోతంగల్ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ స్వహస్తాలతో అందమైన రాఖీలను తయారు చేశారు. వివిధ ఆకృతులు, రంగులతో రూపొందించిన రాఖీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డి. సాయిలు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు కళలు, చేతివృత్తులపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.



పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు లత, ప్రోగ్రాం ఇన్‌చార్జి రమాదేవి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మాస్టర్ ట్రైనర్ గంగ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాఖీ తయారీ కార్యక్రమం విద్యార్థుల్లో సోదర




సోదరీమణుల అనుబంధం, పండుగల పట్ల అవగాహనతో పాటు కళాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా సాగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది.

# మెదక్ ఖేలో ఇండియా డైలాగ్‌లో భాగంగా ఖేల్ కి బాత్ పీఎం కే సాత్

◆ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27(జన సంఘర్షణ)

ఆగస్టు 29న దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మై భారత్-మేరా యువత భారత్ మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్ తెలిపారు. దిగ్గజ హాకీ క్రీడాకారుడు, జాతీయ ఐకాన్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రత్యేక కార్యక్రమాన్ని ఆగస్టు 27న మెదక్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా "ఖేలో ఇండియా డైలాగ్‌లో భాగంగా ఖేల్ కి బాత్ పీఎం కే సాత్" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దేశంలోని యువత, క్రీడాకారులు, భవిష్యత్ తరాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. దేశంలోని ప్రతి జిల్లాలో రెండు కళాశాలల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు క్రీడాకారులతో నేరుగా సంభాషించే అవకాశం కల్పించడంతో పాటు, గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత క్రీడా రంగంలో వచ్చిన మార్పులు, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు అందుతున్న అవకాశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆగస్టు 27న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 1,600 ప్రాంతాల్లో ఉన్న 8 లక్షలకు పైగా యువతను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల యువతను ఒకే జాతీయ వేదికతో అనుసంధానం చేసినట్లు తెలిపారు.

కార్యక్రమానికి హాజరైన యువత ఉదయం 10 గంటలలోపు సంబంధిత వేదికలకు చేరుకుని ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం స్థానిక యువతతో పరస్పర చర్చలు, భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వీ దీష్ట్రుతీఫ్ వాలంటీర్లు, స్థానిక క్రీడాకారుల మధ్య ప్రత్యేక పరస్పర చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ యువతను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు వారితో పరస్పర చర్చలో పాల్గొన్నారు. అనంతరం




సుమారు 15 నిమిషాల పాటు "యువ సంవాద్" కార్యక్రమం నిర్వహించారు. యువత తమ ఆలోచనలు, సూచనలు, భారత క్రీడా రంగం, వికసిత్ భారత్ భవిష్యత్తుపై తమ ఆకాంక్షలను పంచుకునే అవకాశం కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల మెదక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శరత్ దీపిక, బి. విజయలక్ష్మి, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి సువర్ణ, సైకిలిస్ట్ యాదగిరి, పునమ్ రాజ్ పురోహిత్, మోడరేటర్ తదితరులు పాల్గొన్నారు.యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భద్రాచలంలో విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా?

◆ **అధికార పార్టీ రెండు వర్గాల మధ్య పోటాపోటీ..**
◆ **అధికారులపై ఒత్తిళ్ల ఆరోపణలు**





**భద్రాచలం/, ఆగస్టు 27/ (జనసంఘర్షణ):**
భద్రాచలం పరిధిలో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య ఇసుక రవాణా విషయంలో పోటాపోటీ నెలకొందన్న ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. అక్రమ ఇసుక తరలింపులను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులపై కొందరు అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తీసుకువస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో విధులు నిర్వహించాలా? వద్దా? అనే పరిస్థితిలో కొంతమంది ఉద్యోగులు ఉన్నారన్న చర్చ సాగుతోంది. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటే నిబంధనల అమలు ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**నాయకుడి పేరు అడ్డుపెట్టుకుని వసూళ్ల ఆరోపణలు!**

ఇదిలా ఉండగా, ఓ సీనియర్ అధికార పార్టీ నాయకుడి పేరు చెప్పుకుంటూ ఓ వ్యక్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధ్రువీకరణ కావాల్సి ఉంది. సంబంధిత నాయకుడి పేరును అడ్డుపెట్టుకుని ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారులకు హెచ్చరిక....**

ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను ప్రోత్సహించే వారిపైనా, అధికారులపై అనుచిత ఒత్తిళ్లు తెచ్చేవారిపైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి

◆ **బైక్‌పై వెళ్తుండగా ఘోర ప్రమాదం..**
◆ **కుటుంబంలో విషాదం**



**బాన్సువాడ, ఆగస్టు 27 (జనసంఘర్షణ):**
ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన బాన్సువాడ--కొత్తబాది ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాన్సువాడ వైపు నుంచి కొత్తబాది వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పాల్యా రాజు (28) మొగలాన్‌పల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్-765డీ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని కొత్తబాది గిర్ని తండాకు చెందిన పాల్యా రాజుగా పోలీసులు గుర్తించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఊహించని ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**ప్రమాదానికి కారణమెవరు?...**

రోడ్డు పక్కన ఎలాంటి హెచ్చరిక లైట్లు లేకుండా ట్రాక్టర్‌ను నిలిపి ఉంచడం వల్ల ప్రమాదం జరిగిందా? లేక ద్విచక్ర వాహనం అతివేగమే ప్రమాదానికి కారణమా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.


# తిర్మలాపూర్‌లో ఎస్ఐఆర్ గ్రామసభ..

◆ **ఓటరు జాబితాపై ప్రత్యేక పరిశీలన..**
◆ **అర్హులైన ప్రతి ఒక్కరూ వివరాలు సరిచూసుకోవాలి**



**తిర్మలాపూర్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తిర్మలాపూర్ గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓటరు జాబితాను పరిశీలిస్తూ అర్హులైన ఓటర్ల వివరాలను నిర్ధారించడంతో పాటు జాబితాలో చోటుచేసుకున్న మార్పులు, సవరణలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకోవాలని, పేరు లేకపోయినా అర్హత ఉన్న వారు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా గైర్హాజరు, మృతి చెందిన, వేరే ప్రాంతానికి తరలిపోయిన, డూప్లికేట్ ఓటర్లు తదితర అంశాలను పరిశీలించి జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అర్హత మేరకు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలు ప్రత్యేక గ్రామ సర్పంచ్, బోయి సైదవ, సెక్రెటరీ, వెంకటేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్ సంజు, తదితరులు పాల్గొన్నారు గ్రామసభను సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఎంతో విలువైనదని అధికారులు పేర్కొన్నారు.

## సిఐడి సిఐ ( రిటైర్డ్) జింక ఆంజనేయులు ముదిరాజ్ కుమారుని వివాహానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (జన సంఘర్షణ)**
ఉమ్మడి మెదక్ జిల్లా చేగుంట మండలము వడియారం గ్రామానికి చెందిన సిఐడి,సిఐ (రిటైర్డ్) జింక ఆంజనేయులు ముదిరాజ్ కుమారుని వివాహము నిజామాబాదు పట్టణంలోని అమృత గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు (పిసిసి చీఫ్) మహేష్ కుమార్ గౌడ్ హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి గౌరవ తలారి బిక్షపతి ముదిరాజ్, జింక వారి కుటుంబ సభ్యులు ,కూరగాయల వారి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఈ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# బోధన్ పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియ

◆ **13, 14వ వార్డుల్లో ఓటరు జాబితాపై ప్రత్యేక పరిశీలన ఎమ్మార్వో విటల్ సార్**

**బోధన్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):**




బోధన్ పట్టణంలోని 13, 14వ వార్డుల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను సరిచూస్తున్నారు. ఈ ప్రక్రియను బోధన్ ఎమ్మార్వో విట్టల్ పర్యవేక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు లేదా పునరావృత పేర్లు లేకుండా నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలని ఎమ్మార్వో విట్టల్ సూచించారు.

# లారీ ఢీకొని ఏడేళ్ల విద్యార్థిని మృతి

◆ **పాఠశాలకు వెళ్తుండగా విషాదం..**
◆ **తల్లిదండ్రుల రోదనతో విషాదఛాయలు**

**బాన్సువాడ, ఆగస్టు 27 (జనసంఘర్షణ):**





పాఠశాలకు వెళ్తున్న ఏడేళ్ల చిన్నారిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన బాన్సువాడ పట్టణంలో చోటుచేసుకుంది. తాడ్‌కోల్ చౌరస్తా వద్ద మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడుపుతూ పాఠశాలకు వెళ్తున్న బాలికను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో బాలిక లారీ టైర్ల కింద పడి ప్రాణాలు కోల్పోయింది. ఉదయం పాఠశాలకు వెళ్తున్న చిన్నారి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. 'మమ్మీ, డాడీ.. పాఠశాలకు వెళ్తున్నా' అంటూ ఇంటి నుంచి వెళ్లిన తమ చిన్నారి ఇక తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి రోదనలు స్థానికులను కలచివేశాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమా అనే కోణంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం తెలియాల్సి ఉంది.

జన సంఘర్షణ

శుక్రవారం
28 ఆగస్టు 2026

# సీసీఆర్‌టీ శిక్షణలో తెలంగాణ సంస్కృతి ప్రదర్శన

❑ న్యూఢిల్లీలో 21 రోజుల ఓరియంటేషన్ కోర్సులో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ ఉపాధ్యాయులు





న్యూఢిల్లీ/, ఆగస్టు 27 /(జనసంఘర్షణ):
కేంద్ర సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రం (సీసీఆర్‌టీ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న 21 రోజుల ఓరియంటేషన్ కోర్సులో తెలంగాణ ఉపాధ్యాయులు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాలను ప్రదర్శిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. శిక్షణలో భాగంగా తెలంగాణకు చెందిన సాంస్కృతిక విశిష్టతలను ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులకు పరిచయం చేస్తూ రాష్ట్ర వైవిధ్యాన్ని చాటుతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిజామాబాద్‌కు చెందిన బట్టు కల్యాణి (టీజీటీ ఇంగ్లిష్, టీజీఎంఎస్ గుంగల్, యాచారం, రంగారెడ్డి), బి. శ్రీనివాస్ (ఇంగ్లిష్, జెడ్పీహెచ్ఎస్ బెజ్జోరా), రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కత్తి స్వరూప రాణి (ఇంగ్లిష్), నిర్మల్ జిల్లాకు చెందిన ఎస్. కిషోర్ (సోషల్ సైన్స్, ఎంపీయూపీఎస్ కొత్తమద్దిపడగ) పాల్గొంటున్నారు. తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించే సంప్రదాయాలు, జానపద కళలు, సాంస్కృతిక అంశాలు, ప్రజల జీవన విధానాలను ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల వారికి రాష్ట్ర సంస్కృతిని పరిచయం చేస్తున్నారు. విద్యాబోధనతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకమో ఈ కార్యక్రమం చాటిచెబుతోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతీయ స్థాయి వేదికపై గుర్తింపు తీసుకురావడంతో పాటు రాష్ట్ర గొప్పతనాన్ని ఇతర ప్రాంతాలకు పరిచయం చేస్తున్న ఉపాధ్యాయుల కృషిపై పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.



# లారీ ఢీకొని ఐదేళ్ల చిన్నారి మృతి

❑ పాఠశాలకు బయలుదేరిన పది నిమిషాల్లోనే విషాదం..
❑ తాడ్‌కోల్ చౌరస్తా వద్ద ఘటన

బాన్సువాడ, ఆగస్టు 27 (జనసంఘర్షణ):
ఉదయం నిద్రలేచి స్నానం చేసి పాఠశాలకు సిద్ధమైన ఆ ఐదేళ్ల చిన్నారి.. యూనిఫాం ధరించి, బూట్లు వేసుకుని 'మమ్మీ.. డాడీ.. నేను బడికి వెళ్తున్నాను.. బాయ్ బాయ్' అంటూ తల్లిదండ్రులకు టాటా చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. కానీ పది నిమిషాలు గడవకముందే ఆ కుటుంబానికి గుండెలు పగిలే విషాద వార్త చేరింది. లారీ ఢీకొనడంతో చిన్నారి మృతి చెందిందన్న సమాచారం తెలిసి తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని తాడ్‌కోల్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం ఈ విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పాఠశాలకు వెళ్తున్న చిన్నారిని మహారాష్ట్రకు చెందిన లారీ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న చిట్టితల్లి బుడిబుడి అడుగులతో బడికి వెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. చిన్నారి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించాయి.

**రద్దీ ప్రాంతంలో భద్రత ఎక్కడ?**

తాడ్‌కోల్ చౌరస్తా నిత్యం జనంతో రద్దీగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రహదారికి ఇరువైపులా పండ్ల దుకాణాలు, ఇతర వ్యాపారాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి రద్దీ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించి తాడ్‌కోల్ చౌరస్తా వద్ద రహదారి ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోసారి ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని



పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

❑ పెండింగ్ డీఏలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలి..
❑ కీలక పోస్టులు భర్తీ చేయాలి

నిజామాబాద్, ఆగస్టు 27 (జనసంఘర్షణ):




ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక ప్రభుత్వ శాఖల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉద్యోగులపై పని భారం పెరుగుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న కీలక పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. అదేవిధంగా ఉద్యోగులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్న జీపీఎస్ విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యంలిచేయకుండా తక్షణమే చర్చలు జరిపి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేఏసీ నాయకులు కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహాధర్నాలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా లోక్‌షాహీర్ అన్నాభావు సాఠే 106వ జయంతి

❑ మహారాష్ట్ర బిలోలి తాలూకాలోని కార్లపాట్ గ్రామంలో నిర్వహణ

బిలోలి,/ ఆగస్టు 27 /(జనసంఘర్షణ):



మహారాష్ట్రలోని బిలోలి తాలూకా కార్లపాట్ గ్రామంలో లోక్‌షాహీర్ అన్నాభావు సాఠే 106వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, అభిమానులు పాల్గొని అన్నాభావు సాఠే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక చైతన్యం, సమాజంలోని అణగారిన వర్గాల కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం అన్నాభావు సాఠే చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ పోచిరాం ప్రతినిధులు సభాధ్యక్షులు సింధూరి గంగాధర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జయంతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గేను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే

❑ కాంగ్రెస్ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ

కలబురగి (గుల్బర్గా)/, ఆగస్టు 27/ (జనసంఘర్షణ):



జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు గురువారం కర్ణాటకలోని కలబురగి (గుల్బర్గా)లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖర్గేకు ఎమ్మెల్యే ఆత్మీయంగా అభివాదం చేసి పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీలో ఎన్‌ఆర్‌ఐ భుజం భాస్కర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. జాతీయ కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కలవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ బలోపేతంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ భేటీకి ప్రాధాన్యత ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

# మద్నూర్ సీహెచ్‌సీలో రోగుల ఇబ్బందులు

❑ శుభ్రత, ఆహారం సమస్యలపై అధికారుల దృష్టికి ఫిర్యాదు

మద్నూర్,/ ఆగస్టు 27/ (జనసంఘర్షణ):




మద్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జంజ)లో రోగులు శుభ్రత, ఆహారం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ కామారెడ్డి డీసీహెచ్ఎస్, బాన్సువాడ ఆర్డీఓ, మద్నూర్ ఎంఆర్ఓ ల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ఆధారపడుతున్న పేద, మధ్యతరగతి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం....**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగులకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# అన్నాభావు సాఠే జయంతి సందర్భంగా ఘన సన్మానం

❑ ఎమ్మార్పీఎస్ నాయకుడిగా సన్మానించిన సింధూరి సురేష్

బిలోలి,/ ఆగస్టు 27/ (జనసంఘర్షణ):





లోక్‌షాహీర్ అన్నాభావు సాఠే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడిగా పాల్గొన్న తనను సింధూరి సురేష్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయంతి కమిటీ సభ్యులు చూపిన ఆత్మీయతకు, గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అన్నాభావు సాఠే ఆశయాలు, సామాజిక చైతన్యం, సమానత్వ సందేశాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం అన్నాభావు సాఠే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తనను గౌరవంగా సన్మానించిన సింధూరి సురేష్‌కు, జయంతి కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ.. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# వరల్డ్ చాంపియన్‌గా సర్వేపల్లి చిన్నారి

- 8 ఏళ్ల వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ
- బెల్జియంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగిన 58వ ఫ్లాండర్స్ గ్రాండ్ పిక్స్ వర్డల్ చాంఫియన్ షిప్ లో భాగంగా స్పీడ్ స్కేటింగ్ లో నాలుగు స్వర్ణాలు, రెండు రజత పతకాలు కైవసం చేసుకున్న చేవూరు భవిష్ రెడ్డి
- నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో భవిష్ రెడ్డిని సత్కరించి ఆశీర్వదించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.




**మనుబోలు. 27.8.2026 (జన సంఘర్షణ):** ముత్తుకూరు మండలం దొరువులపాళెం పంచాయతీ తూర్పు నాగలదొరువుకు చెందిన భవిష్ అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించడం ఎంతో సంతోషంగా ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో చిన్నారిభవిష్ ను అభినందించారు. అతి చిన్నవయస్సులోనే అద్భుతమైన ప్రతిభాపాఠవాలు ప్రదర్శించడం ద్వారా యూరప్ దేశాల్లో ఉచిత విద్యతో పాటు స్కేటింగ్ లోనూ ఉచితంగా శిక్షణ పొందే అవకాశం పొందడం గొప్ప విషయం సర్వేపల్లి నుంచి వెళ్లి ఇంటర్నేషనల్ కోచ్ లతో ప్రశంసలు అందుకోవడం అంటే చిన్నవిషయం కాదు చిన్నారి భవిష్ ఉజ్వల భవిష్యత్తు పొందాలని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను. భవిష్ రెడ్డితో పాటు తల్లిదండ్రులు చేవూరు వంశీరెడ్డి, మౌనికకు కూడా అభినందనలు తెలియజేస్తున్నాను

## శ్రీ సీతారాముల వారి మహా కుంభాభిషేక కార్యక్రమంలో... మాజీ ఎమ్మెల్యే కుమార్తె, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి,

**తొట్టంబేడు ఆగస్టు 27 (జన సంఘర్షణ):**



శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, లింగమ నాయుడు పల్లి అరుంధతి వాడాలో వెలసిన శ్రీ సీతరాముల వారి మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి, పవిత్ర రెడ్డి బియ్యపు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ పాల్గొన్నారు,ముందుగా గ్రామస్తులు వారికి స్వాగతం పలికి, శ్రీ సీతరాముల వారి మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొని, వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామివారిని దర్శించుకున్నారు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంధం ఆనంద్ ,కోగిల రూపేష్ అండ్ కురవకనేరి యువత, గంధం ఆనంద్, కొగిల మనోజ్ ,చింత రాజేంద్ర ,కొగిల గంగరాజు, కోగిల ఉదయకుమార్, కోగిల ఓసరయ్య, తుమ్మూరు సురేష్, గంధంవెంకటకృష్ణయ్య, చిన్నరంగయ్య, తొట్టం బేడు పేదరంగయ్య,కోగిల రూపేష్, కురవకనేరి యువత తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు ముమ్మరం.. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు

**బుచ్చినాయుడు కండ్రిగ ఆగస్టు27 (జన సంఘర్షణ):**




రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే లక్ష్యంతో బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్ల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్‌కు సంబంధించిన నిబంధనలు పాటించకపోవడం తదితర ఉల్లంఘనలను పోలీసులు పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ హరి ప్రసాద్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా వాహన తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.


## పాండురంగారెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే బొజ్జల నివాళి

**శ్రీకాళహస్తి ఆగస్టు 27 (జన సంఘర్షణ):** మండలం లోని ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ నందు ఆయన నివాసానికి చేరుకుని, పాండురంగారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుండి పాండురంగారెడ్డి పార్టీ బలోపేతానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. వారి మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వారితోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



## అరుణాచలేశ్వరునికి రుద్రాభిషేకాలు

**సదుం ఆగస్టు 27 (జన సంఘర్షణ):** సదుం మండలం జాంద్రపేట లో వెలసిన శ్రీ అరుణాచలేశ్వర స్వామికి గురువారం రాత్రి పౌర్ణమి సందర్భంగా వివిధ రకాలైన అభిషేక నిర్వహించారు. అదేవిధంగా బూరగమంద పంచాయతీ శివకోన లో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు . అదేవిధంగా చెరుకువారిపల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలోను రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి వివిధ రకాలైన సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీ మహా గణపతి ఆలయ కుంభాభిషేకం

**బంగారుపాళ్యం-ఆగష్టు 27... (జన సంఘర్షణ):** బంగారుపాళ్యం మండల పరిధిలోని. రాగిమానుపెంట పంచాయతీ బిఎల్ కండిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమహాగణపతి ఆలయ మహా కుంభాభిషేకం వైభవంగా జరుగునని గ్రామస్తులు తెలిపారు. ఈనెల8 28 తేది శుక్రవారం నుండి 30తేది ఆదివారం వరకు అతి వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని తెలిపారు మూడు రోజులు గణపతి పూజ,నవగ్రహ హోమం,నూతన విగ్రహ ప్రతిష్ట,కలశ పూజ,మరియు విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుపబడునని తెలిపారు. అలాగే సాంస్కృతి కార్యక్రమాలు జరుపబడినని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడునని కావున బిఎల్ కండిగా గ్రామస్తులు, చుట్టుపక్క గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకి పాత్రు కాగలరని తెలిపారు.



## ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు

- డాక్టర్ లాయర్ అరవ పార్వతయ్య. మాజి సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు.

**మనుబోలు. 27.8.2026(జన సంఘర్షణ):** నెల్లూరు వచ్చిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కె జవహర్ణం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు గురువారం మధ్యాహ్నం కలుసుకున్నారు. ఎస్సీ ఎక్ట్రాటిక్ కమిటీ సభ్యులు డాక్టర్ లాయర్ అరవపార్వతయ్య మాజీ అట్రాసిటీ కమిటీ సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా ఎస్సీ. కమీషన్ చైర్మన్ జవహర్ ను కలుసుకుని శాలువా కప్పి సత్కరించారు ఈ సందర్భంగా ఆరవ పార్వతయ్య కొద్దిసేపు ముచ్చటించారు. నెల్లూరు తిక్కన ప్రాంగణఆఫీసులో గురువారం జవహర్ కి దళి సంఘాలు నాయకులు పోటాపోటీగా స్వాగతం చెప్పారు దళిత నాయకులు సాలువలు కప్పి సత్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ నెల్లూరు వచ్చారు. నెల్లూరు టౌన్ లో దళిత సంఘాలు జవహర్. కి ఫ్లెక్సీలు భారీ ఎత్తున పెట్టి ఘన స్వాగతం చెప్పడం విశేషం. ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కి ఇంత పెద్ద ఎత్తున స్వాగతం పలకడం ఫ్లెక్సీలు పెట్టడం నెల్లూరు చరిత్రలో ఇదే మొదటిసారి.



## విద్యార్థుల అసెస్మెంట్ పుస్తకాల పరిశీలన

**బుచ్చినాయుడు కండ్రిక ఆగష్టు 27 (జన సంఘర్షణ):** మండలంలోని గాజులపెళ్లూరు ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తెలుగు, గణితం, ఇంగ్లీష్ అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించి, ఆయా సబ్జెక్టుల్లో వారి అవగాహనను ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులు మూడు సబ్జెక్టుల్లోనూ పట్టు సాధించి, చదవడం--రాయడంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష

- రూ 12,500 జరిమానా విధించిన నాయుడుపేట కోర్టు

**నాయుడుపేట, ఆగస్టు 27 (జన సంఘర్షణ):** నాయుడుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లం జంక్షన్ సమీపంలో మద్యం సేవించి, అతివేగంగా, నిర్లక్ష్యంగా కంటైనర్ లారీ నడిపి ప్రజల ప్రాణాలకు, భద్రతకు ప్రమాదం కలిగించిన తమిళనాడు ప్రాంతానికి చెందిన డ్రైవర్ తియగ రాజన్ పై నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కేసును విచారించిన నాయుడుపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి. మీనాక్షి సుందరి నిందితుడికి 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధించినట్లు నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సై ఎం.శివ శంకరరావు లు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ ఎం. శివశంకరరావు లు మాట్లాడుతూ వాహన చోధకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడిపినా,ట్రాఫిక్ నిబంధనలు పాటించుకున్నా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.వాహన సాధకులు వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని సురక్షితంగా వాహనాన్ని నడపాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.



## ఎల్లారెడ్డిలో ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ ఓటరు జాబితాల అందజేత

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హార్డ్ కాపీలు అందించిన డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

**ఎల్లారెడ్డి, ఆగస్టు 27 (జన సంఘర్షణ):** ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా హార్డ్ కాపీలను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్, ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబాకు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అందజేశారు. గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ లిడ్రాఫ్ట్ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బాధ్యతగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co